

విద్యార్థులతో కలిసి క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

# విద్యార్థుల భద్రతే ధ్యేయం

## ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

బాసర, జూలై 3 : ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థుల భద్రతే ధ్యేయంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలలు అన్నారు. బుధవారం వారు ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మాట్లాడారు. క్యాంపస్‌లో మొక్కలు నాటారు. వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భద్రతపరమైన సమస్య వస్తే ఇన్‌స్పెక్టర్ రాకేశ్ ద్వారా ముథోల్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేయాలన్నారు. క్యాంపస్, పరిధిలో గుట్కా వంటి నిషేధిత వస్తువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వీరి వెంట భైంసా నూతన ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, ఇన్‌స్పెక్టర్ రాకేశ్, బాసర ముథోల్ ఎస్సైలు గణేశ్, సాయికిరణ్ ఉన్నారు.



క్యాంపస్ పరిసరాలను పరిశీలిస్తూ..

# ఆందోళనల పర్వం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ధర్నాలు




***ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా బుధవారం ఆందోళనలు కొనసాగాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్, నిర్మల్‌ల ఎదుట ఆందోళన నిర్వహించారు. దివ్యాంగులకు కేంద్రం రూ.3 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పెంబి పీహెచ్‌సీలో అవ్వాల్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని వేణునగర్ గ్రామానికి చెందిన ఆదివాసులు పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు.***

## తెలంగాణకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులతో విద్యార్థులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి
- ఆదిలాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏబీవీపీ నాయకులు

ఎదులాపురం, జూలై 3 : తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటుగా భావిస్తున్నామని ఏబీవీపీ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టా రు. కలెక్టర్ చౌరస్తా నుంచి విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీగా వచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కలెక్టరేట్ గేట్‌ను తోసి గేటును ఎక్కే ప్రయత్నం చేశా రు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రిని కూడా నియమించకుండా ప్రభుత్వం ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌పిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తూ త్వరలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహేశ్, నిఖిల్, విఘ్నేశ్, కార్తీక్, ఉదయ్, శివసాయి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌పీఆర్డీ నాయకులు

## కేంద్రం ప్రభుత్వం రూ.3 వేల పింఛన్ ఇవ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వాలి
- ఎన్‌పీఆర్డీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం నగేశ్

ఎదులాపురం, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇస్తున్న రూ.300 పింఛన్‌ను పెంచి రూ.3 వేలు ఇవ్వాలని, అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేలు పింఛన్‌ను వెంటనే ఇవ్వాలని ఎన్‌పీఆర్డీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆత్రం నగేశ్ డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి ఆరీఫా, కోశాధికారి అనసూయ, జిల్లా సభ్యులు పోచ్చన్న, విజయ్ పాల్గొన్నారు.



## అవ్వాల్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలి

పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసులు

పెంబి, జూలై 3 : పెంబి పీహెచ్‌సీలో అవ్వాల్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని బుధవారం వేణునగర్ గ్రామానికి చెందిన ఆదివాసులు పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. వేణునగర్‌కు చెందిన ఆత్రం లక్ష్మి ఎనిమిది నెలల గర్భిణీ. బుధవారం ఉదయం రక్త స్రావంతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు పెంబి పీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తీసుకొచ్చారు. వైద్యులు ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాలని సూచించడంతో 108కు ఫోన్ చేశారు. రక్త స్రావంతో బాధపడుతున్న గర్భిణీ లక్ష్మి గంటన్నర వరకు అంబులెన్స్ కోసం ఎదురుచూసింది. ఈ సందర్భంగా ఆదివాసులు మాట్లాడుతూ.. పెంబి మండలంలో ఎక్కువగా ఆదివాసులు నివసిస్తున్నారని, మారుమూల గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. కొన్ని నెలల క్రితం పెంబి పీహెచ్‌సీలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన అవ్వాల్ అంబులెన్స్ ఉండేదని, ప్రస్తుతం ఈ అంబులెన్స్‌ను పీహెచ్‌సీ నుంచి తొలగించడంతో మారుమూల గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలు కూడా దొరుకక వైద్యం అందడంలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పెంబి పీహెసీలో అవ్వాల్ అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకుడు రమేశ్ పాల్గొన్నారు.



రోడ్డుపైనే చదువుకుంటూ విద్యార్థుల నిరసన

## విద్యార్థుల ధర్నా

నిర్మల్ అర్బన్, జూలై 3 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ నుంచి విద్యార్థి సంఘ నాయకులు, కళాశాల, పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం నుంచి శివాజీ చౌక్ వరకు కొనసాగింది. శివాజీ చౌక్ వద్ద జాతీయ రహదారిపై విద్యార్థులు నోట్ బుక్స్‌ను చదువుకుంటూ ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివకుమార్ మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. దీంతో ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, దినేశ్, సన్ని, లక్ష్మణ్, సాయి సిద్దూ, విఘ్నేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి

ఎదులాపురం, జూలై 3 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ జడ్పీచైర్ పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా రూ.2500 ఇంకా రాలేదన్నారు. 18 ఏండ్లు నిండిన యువతకు స్కూటీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు ధోని జ్యోతి, ముఖ్యకార్యదర్శి అనిత, సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

## కనీస వేతనాలు పెంచాలి..

నిర్మల్ అర్బన్, జూలై 3 : కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేజీబీవీల్లో కొన్నేండ్లుగా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తున్న కనీస వేతనం రావడం లేదని వాపోయారు. కనీస వేతనం అందించాలని డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, లక్ష్మీ, కవిత, జయసుధ, పార్వతి, లక్ష్మీ, నరసమ్మ పాల్గొన్నారు.

### కేటగిరీలవారీగా కటాఫ్..

| కేటగిరీ | బాలికలు | బాలురు |
|---|---|---|
| ఓసీ | 10.2 | 10.2 |
| ఈడబ్ల్యూఎస్ | 10 | 10 |
| బీసీఏ | 10.1 | 10.1 |
| బీసీబీ | 10.1 | 10.1 |
| బీసీసీ | 9.2 | 9.5 |
| బీసీడీ | 10 | 10 |
| బీసీఈ | 10.1 | 101 |
| ఎస్సీ | 10 | 10 |
| ఎస్టీ | 10 | 10 |

### కేటగిరీలవారీగా సాధించిన సీట్లు

| కేటగిరీ | బాలికలు | బాలురు | మొత్తం |
|---|---|---|---|
| ఓసీ | 5 | 0 | 5 |
| ఈడబ్ల్యూఎస్ | 123 | 61 | 184 |
| బీసీఏ | 101 | 38 | 139 |
| బీసీబీ | 259 | 79 | 338 |
| బీసీసీ | 9 | 5 | 14 |
| బీసీడీ | 201 | 82 | 283 |
| బీసీఈ | 48 | 70 | 65 |
| ఎస్సీ | 156 | 73 | 229 |
| ఎస్టీ | 74 | 73 | 147 |
| మొత్తం | 976 | 428 | 1,404 |

## ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితా విడుదల

- 69 శాతం అమ్మాయిలే..
- 95 శాతం సర్కారు స్కూళ్ల విద్యార్థులే ఎంపిక
- ఈనెల 8, 9, 10న కౌన్సెలింగ్
- అత్యధికంగా సిద్దిపేట జిల్లా నుంచే ఎంపిక

బాసర, జూలై 3 : బాసర ట్రిపుల్ ఐటీ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల జాబితాను బుధవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశ్, ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి, వీసీ వెంకటరమణ విడుదల చేశారు. 1,500ల సీట్లకు 1,404 మందితో జాబితా ప్రకటించారు. ఇందులో అమ్మాయిలు 69 శాతం ఉండగా, సర్కారు స్కూల్స్ నుంచి 95 శాతం మంది ఎంపికయ్యారు. బుధవారం విడుదల చేసిన జాబితాలో 95 శాతం ప్రభుత్వ విద్యార్థులు ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో 1500 సీట్లకు 15 వేల దరఖాస్తులు రాగా.. జాబితాను ట్రిపుల్ ఐటీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వచ్చిన సీజీపీఏకు 0.4 పాయింట్లు అదనంగా కలిపి ప్రాధాన్యత ఇచ్చారు.

### జిల్లాల వారీగా సీట్ల వివరాలు

సిద్దిపేట 330, నిజామాబాద్ 157, కామారెడ్డి 64, సంగారెడ్డి 132, కరీంనగర్ 66, రాజన్న సిరిసిల్ల 81, నల్లగొండ 61, రంగారెడ్డి 46, మెదక్ 34, వరంగల్ అర్బన్ 15, వరంగల్ రూరల్ 6, మహబూబాబాద్ 18, జగిత్యాల 35, సూర్యాపేట 46, ఖమ్మం 33, మంచిర్యాల 28, జనగాం 28, నిర్మల్ 72, జయశంకర్ భూపాలపల్లి 4, మేడ్చల్ 17, పెద్దపల్లి 20, ములుగు 12, నాగర్‌కర్నూల్ 6, యాదాద్రి భువనగిరి 16, భద్రాద్రి కొత్తగూడెం 7, వికారాబాద్ 2, ఆదిలాబాద్ 27, వనపర్తి 1, హైదరాబాద్ 5, జోగులాంబ గద్వాల్ 1, మహబూబ్‌నగర్ 8, ఓపెన్ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం నుంచి 3, అనంతపూర్ 2, విశాఖపట్నం 2, గుంటూరు 1, కర్నూల్ 1, ప్రకాశం జిల్లా నుంచి 1 ఎంపికయ్యారు.

### కౌన్సెలింగ్ తేదీలివే..

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు ఈనెల 8,9,10వ తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుంది. ఈ నెల 8వ తేదీన క్రమ సంఖ్య 1 నుంచి 500ల వరకు, 9న 501 నుంచి 1000 వరకు, 10న 1001 నుంచి 1404ల వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు దరఖాస్తులో పొందు పర్చిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని అధికారులు తెలిపారు.

## సేవలకు సెలవు

- ముగియనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం
- ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం విముఖత
- ప్రత్యేకాధికారుల పాలనకు చర్యలు
- అభివృద్ధి పనులకు ఆటంకం

ఆదిలాబాద్, జూలై 3(నమస్తే తెలంగాణ) : జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనుంది. నేటి(గురువారం)తో జడ్పీటీసీలు, రేపటి(శుక్రవారం)తో ఎంపీటీసీల ఐదేళ్ల పదవీకాలం పూర్తికానుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికల కోసం చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా, మండల పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానుంది. ఇప్పటికే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ఫిబ్రవరి 1 నుంచి కొనసాగుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేంత వరకు ప్రత్యేకాధికారులు ఉంటారు. ఈ దిశగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉండగా మండలాలకు వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు. జిల్లాలోని 2019లో 17 మండలాల జడ్పీటీసీ, 158 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగగా మెజార్టీ స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నది. 9 మండలాల్లోని జడ్పీటీసీ స్థానాలతోపాటు 83 ఎంపీటీసీ స్థానాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. జడ్పీ చైర్మన్ పదవితోపాటు 11 ఎంపీపీ స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పాత్ర కీలకం. పదవీకాలం ముగుస్తున్న మండల పాలక వర్గాలకు జిల్లాలో అధికారులు,ఎమ్మెల్యేలు సన్మానాలు చేస్తున్నారు.

### ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తం

ఆదిలాబాద్ జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో ఐదు నెలల నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. పంచాయతీల పరిధి ప్రకారం నాలుగైదు, పంచాయతీలకు కలిపి ప్రత్యేకాధికారులను నియమించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తమ సొంత శాఖకు సంబంధించిన పనులను చూడడంతోపాటు పంచాయతీల పనులపై దృష్టి సారించడం కష్టంగా మారింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతి, ఇతర కార్యక్రమాలను చేపట్టి గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. ఇప్పుడు మండలాల్లో సైతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుండడంతో పర్యవేక్షణ కొరవడి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. 2018లో కేసీఆర్ ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పదేండ్లపాటు రిజర్వేషన్లు వర్తించేలా చర్యలు తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లను మారుస్తుందా? లేదా? అనే విషయం తేలాల్సి ఉంది.








